పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

సర్కార్ తీరుపై రైతన్న కన్నెర్ర

పంటలు ఎండటంతో ఆందోళన • పెద్దపల్లి ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

జూలపల్లి, ఏప్రిల్ 11 : నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం అబ్బాపూర్, జూలపల్లి రైతులు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దిష్టిబొమ్మను దహనం చేశారు. చెరువులు, కుంటలు ఎస్సారెస్పీ నీటితో నింపాలని రెండు నెలలుగా విజ్ఞప్తి చేసినా ఏ మాత్రం చలనం లేదని ధ్వజమెత్తారు. చేతగాని ఎమ్మెల్యే తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు లేక చేతికి వచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నామని తాము అల్లాడుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాగునీరు ఇవ్వకపోతే రైతుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. వెంటనే ఎస్సారెస్పీ డీ-83 ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రైతులను ఆదుకోకపోతే దశలవారీగా ఆందోళనలు చేస్తామని అన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

సదర్మాట్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ • నిర్మల్ ప్రధాన రహదారిపై రైతుల రాస్తారోకో

కడెం, ఏప్రిల్ 11 : సాగు నీటి కోసం రైతులు రోడ్డెక్కారు. సదర్మాట్ నీటిని విడుదల చేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడంతో గురువారం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను ఇబ్బందులు పెడుతున్నదని మండిపడ్డారు. సదర్మాట్ ఆయకట్టుకు నీరు ఇచ్చే విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. చేతికొచ్చిన పంటలు, పెట్టుబడులను నాశనం చేయడమే సర్కార్ లక్ష్యమా? అని ప్రశ్నించారు. యాసంగి సాగుకు సదర్మాట్ నుంచి అధికారులు నీటిని విడుదల చేయడంతో పెట్టుబడులు పెట్టి, పంటలు సాగు చేసినట్టు తెలిపారు. 30 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, సాగు చేసుకోవచ్చని స్వయంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హామీ ఇవ్వడంతోనే సాగు చేశామని వారు పేర్కొన్నారు. పంట చేతికందే సమయంలో నీటి విడుదల నిలిపివేశారని

నిర్మల్ జిల్లా నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

మండిపడ్డారు. విషయం తెలుసుకున్న కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జు.. హుటాహుటిన కడెం మండల కేంద్రానికి చేరుకొని సదర్మాట్ నీటిని విడుదల చేయించారు. ప్రస్తుతం ఆ కాలువకు కేవలం 500 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేశారని, 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే చివరి ఆయకట్టు వరకు చేరుతాయని రైతులు, నాయకులు ధర్నా అనంతరం పేర్కొన్నారు. ఈ నీటిని కూడా కేవలం 3 రోజులే విడుదల చేసి, తప్పించుకునే ప్రయత్నమే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లోకం పోకడ



కండక్టర్‌పై దాడి.. ఇద్దరికి రెండేండ్ల జైలు

సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తే చర్యలు

కోర్టు తీర్పుపై సజ్జనార్ హర్షం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీ బస్ కండక్టర్ విధులను ఆటంకపరచడమే కాకుండా దాడిచేసిన కేసులో ఇద్దరు ముద్దాయిలకు జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ కోర్టు రెండేండ్ల జైలుశిక్ష విధించింది. శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్వాగతించారు. గురువారం ట్విట్టర్‌లో హర్షం ప్రకటించారు. గద్వాల ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బీ కృష్ణయ్యపై 2015 మార్చి 15న అలంపూర్‌కు చెందిన చాకలి శ్రీనివాస్, గోపి అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. మద్యం మత్తులో బస్సు ఎక్కిన ఇద్దరు టికెట్ తీసుకోకపోవటమే కాకుండా తోటి ప్రయాణికులతో అసభ్యంగా ప్రవర్తించారు. వారించిన కండక్టర్ కృష్ణయ్యపై దాడి చేశారు. తనపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కండక్టర్ అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్ఐ పర్వతాలు.. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా.. న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు రెండేండ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. నిందితులకు రెండేండ్ల జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీస్, ఆర్టీసీ అధికారులకు సంస్థ తరపున ఎండీ సజ్జనార్ అభినందనలు తెలిపారు. సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా దాడులకు, దౌర్జన్యాలకు దిగితే.. బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వందమంది ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

జైనథ్ (బేల), ఏప్రిల్ 11 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని రేణిగూడ గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. సుమారు 100 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి స్థానికంగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందించారు. ఇందులో తీవ్రంగా గాయపడిన 40 మందిని రిమ్స్‌కు తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఉపాధి కూలీలతోపాటు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కూలీలను మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు.

పెరిగింది రూ.30నే!

మొదటిపేజీ తరువాయి...

గురువారం మార్కెట్‌లో క్వింటా ధాన్యానికి వ్యాపారులు పెంచిన ధర రూ.30 మాత్రమే. ఈనామ్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.1,530కు ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారులు, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినా,మద్దతు ధర క్వింటాకు రూ.2,200 కు బదులుగా రూ.1,560కి మాత్రమే కొనుగోలు చేశారు. అంటే రైతుల ఆందోళనల నేపథ్యంలో సీఎం ట్వీట్ చేసినా వ్యాపారులు విదిల్చింది ముప్పై రూపాయలే. ముఖ్యమంత్రి స్పందించి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినా జనగామ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్ల తీరు మారలేదు. వ్యాపారుల దోపిడీ ఆగలేదు. యార్డులో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అధికారులు చేతులు దులుపుకున్నారు. తేమ, తాలు పేరు తో యథావిధిగా ట్రేడర్లు, వ్యాపారులు రైతులను గోస పెడుతున్నారు. క్వింటాకు రూ.500 బోనస్ ధర ఇస్తామని కాంగ్రెస్ ఆశ పెట్టినప్పటికీ, ఇప్పుడు బోనస్ ధర దేవుడెరుగు మద్దతు ధరే దక్కని పరిస్థితి ఎదురవుతున్నది. క్వింటా ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,200 కాగా, జనగామ మార్కెట్‌లో రైతులకు దక్కింది రూ.1,560 మాత్రమే. అంటే తమకు రూ.500 బోనస్‌కు బదులుగా రూ.640 రివర్స్‌లాస్ వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరుసగా రెండోరోజు గురువారం మార్కెట్ యార్డును సందర్శించి రైతాంగానికి అండగా నిలిచారు. రెండురోజులుగా అతి తక్కువ ధరకు రూ.1,530, రూ.1,560కే అమ్ముకొని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.1,800 ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.



జనగామ వ్యవసాయ మార్కెట్‌లో వడ్ల మాయిశ్చరైజర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దతు ధరకు కొనకపోతే ఊరుకోం: ఎమ్మెల్యే పల్లా

జనగామ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి కేవలం కంటితుడుపు చర్యగా ట్వీట్ చేసి రైతులను మోసం చేశారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో జోక్యం చేసుకున్నా రూ.30 పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ముష్టి వేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం నుంచి మార్కెట్‌లో కనీస మద్దతు ధర రూ.2,200కు ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన ముందుండి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రైతులకు అండగా ఉంటానని, మద్దతు ధరకు ఎందుకు కొనరో చూస్తానని, అన్యాయం జరిగితే యార్డుకు వచ్చి కూర్చుంటానని స్పష్టంచేశారు. తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు కూడా క్వింటాకు రూ.2,200 చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. నష్టాన్ని వ్యాపారుల నుంచి ఇప్పిస్తారా? ప్రభుత్వం ఇస్తాందా? అనేది రైతులకు సంబంధంలేదని చెప్పారు.

కొనుగోళ్లు స్పీడ్‌అప్ చేయాలి: అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పరిశీలించి కాంటాలు వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'రైతుకు దుఃఖం.. దళారికి రొక్కం' శీర్షికతో కథనం ప్రచురించిన నేపథ్యంలో గురువారం ఆయన కమలాపూర్ మండలంలోని కమలాపూర్, గూడూరు, అంబాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులు అధైర్య పడొద్దని, పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. రైస్‌మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన కమలాపూర్ కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తుండగానే వర్షం రావడంతో రైతులకు టార్పాలిన్ కవర్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. 20 కవర్లు ఉన్నాయని అధికారులు చెప్పడంతో మరిన్ని తెప్పించాలని సూచించారు. శుక్రవారం నుంచి కొనుగోళ్లు వేగవంతం చేయాలని, వ్యవసాయాధికారులు దగ్గరుండి టోకెన్లు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు కూడా నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ మాధవి, సివిల్ సప్లయ్ డీటీ కృష్ణ, ఏఈవోలు వినయ్‌వర్మ, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు: సివిల్ సప్లయి కార్పోరేషన్ అధికారులు

'నమస్తే తెలంగాణ' దిన పత్రిక కథనంపై సివిల్ సప్లయి కార్పొరేషన్ అధికారులు సైతం స్పందించారు. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు హనుమకొండ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా 150 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని సివిల్ సప్లయి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ (డీఎం) యు మహేందర్ తెలిపారు. జిల్లాలో 27 లక్షల గన్నీ సంచులు నిలువ ఉన్నాయని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారుల నివేదిక ప్రకారం జిల్లాలో ధాన్యం దిగుబడి ఈ నెల మూడో వారంలో కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలకు గన్నీ సంచులు, టోకెన్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, ట్రక్ చిట్ పుస్తకాలు సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఒకవేళ ఏ మిల్లర్ అయినా మద్దతు ధరకంటే తక్కువ ధరకు కొనగోలు చేస్తున్నట్టు తమ దృష్టికి వస్తే సదరు మిల్లర్‌పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు కమలాపూర్ మండలంలో ఒక్క ఉప్పల్‌లో ఏర్పాటుచేసిన ఐకేపీ కేంద్రానికి మాత్రమే ధాన్యం వచ్చిందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారికి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

అధికారులు వ్యాపారులతో కుమ్మక్కైతే సహించం

సీఎం రేవంత్ ట్వీట్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై రైతుల ఉత్పత్తులకు తక్కువ ధర చెల్లించేందుకు యత్నిస్తే సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం జరిగిన ఘటనలో సత్వరం స్పందించి చర్యలు తీసుకున్న అదనపు కలెక్టర్‌ను అభినందిస్తూ సీఎం గురువారం ట్వీట్ చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో రైతులను మోసం చేయడానికి ప్రయత్నించిన నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అడిషనల్ కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని సీఎం చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	39.9°c	20.4°c
నల్లగొండ	39.4°c	23.4°c
నిజామాబాద్	39.01°c	23.09°c
మెదక్	38.7°c	23.0°c
ఆదిలాబాద్	38.3°c	23.8°c
మహబూబ్‌నగర్	38.0°c	24.5°c
ఖమ్మం	38.0°c	25.0°c
వరంగల్	36.0°c	24.0°c
హైదరాబాద్	35.6°c	25.2°c
కరీంనగర్	35.0°c	25.0°c

ఈసారి ముందుగానే రుతుపవనాలు

- **వాతావరణ నిపుణుల అంచనా**

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): వేసవి ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణ నిపుణులు తీపి కబురు అందించారు. ఈ ఏడాది రుతుపవనాలు కాస్త ముందుగానే వచ్చే అవకాశమున్నట్టు పేర్కొన్నారు. ఎన్నడూలేని విధంగా ఈసారి హిందూ మహాసముద్రం డైపోల్ (ఐఓడీ), లానినా పరిస్థితులు ఏకకాలంలో క్రియాశీలకం కానుండటంతో వర్షపాతం కూడా అధికంగా నమోదయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. హిందూ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండకపోవడాన్ని (ఐఓడీ) అని, మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా చల్లగా మారటాన్ని లానినా అని అంటారు. ఈ రెండు ప్రక్రియలు ఏకకాలంలో సంభవించడం అత్యంత అరుదైన విషయమని, ఇది నైరుతి రుతుపవనాల ఆగమనాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు. సాధారణంగా జూలై నుంచి సెప్టెంబర్ మధ్య నమోదయ్యే అత్యధిక వర్షపాతం ఈసారి అంతకన్నా ముందే నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక అరేబియా సముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు పశ్చిమ, వాయవ్య భారతంలో ఎక్కువకాలం కొనసాగే అవకాశాలున్నాయని తెలిపారు. దీంతో వర్షపాతం భారీగా ఉంటుందని పేర్కొన్నారు.

గురుకుల టీచర్లకు నైట్‌డ్యూటీలు

మొదటిపేజీ తరువాయి...

టీచర్లు అందుబాటులో లేకుంటే పార్ట్ టైం టీచర్లను వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు కచ్చితంగా గురుకులంలోనే ఉండాలని ఆదేశించారు. నైట్ డ్యూటీ టీచర్లు హాస్టళ్లలోనే ఉండి, రాత్రంతా మేల్కొని విద్యార్థుల కదలికలను గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. గురుకుల ప్రిన్సిపాళ్లు ఆయా జిల్లాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ల సాయం తీసుకోవాలని, క్రిటికల్ ఇష్యూస్ ఉంటే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని, రీజినల్ కోఆర్డినేటర్లు గురుకులాలను నిరంతరం పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆదేశాల్లో స్పష్టత కరువు

సొసైటీ పరిధిలోని గురుకులాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు రాత్రి విధులు సర్వసాధారణమే. రోజుకు ఇద్దరు చొప్పున విధుల్లో ఉంటారు. రాత్రి 9.30 గంటలకు, తెల్లవారుజామున 4.30 గంటలకు మరోసారి స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. వీరు రాత్రంతా హాస్టళ్లలోనే ఉండాలన్న ఆదేశాలు ఇప్పటి వరకు లేవు. తాజాగా, సొసైటీ కార్యదర్శి జారీచేసిన ఉత్తర్వుల్లో నైట్ డ్యూటీ ఉపాధ్యాయుల పనివేళలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు లేవు. ఎప్పుడు రావాలి? ఎప్పుడు వెళ్లాలి అనేదానిపై స్పష్టత లేదు.

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

సొసైటీ కార్యదర్శి జారీచేసిన ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. టీచర్లతో నైట్‌వాచ్‌మన్ ఉద్యోగం చేయించడం తగదని మండిపడుతున్నారు. రాత్రంతా మేల్కొని విధులు నిర్వర్తిస్తే ఉదయం మళ్లీ విధులు ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇది తమ ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు శాస్త్రీయ కారణాలు విశ్లేషించకుండా ఉపాధ్యాయులకు నైట్‌డ్యూటీ వేయడం ఎంతమాత్రమూ తగదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇప్పటికే బోధనేతర కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటున్నామని, వీటికి ఇప్పుడు నైట్‌డ్యూటీ చేర్చడం ఎంతమాత్రమూ సరికాదని, ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి: టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ

ఉపాధ్యాయులకు నైట్ స్టే డ్యూటీల కేటాయింపుపై జారీచేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ)అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాకర్ డిమాండ్ చేస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలకు శాస్త్రీయ కారణాలు తెలుసుకోకుండా టీచర్లను నైట్‌వాచ్‌మన్లుగా మార్చడం తగదని, ఇది ఉపాధ్యాయ వృత్తిని అవమానించడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఉపాధ్యాయులను వేధించడం కిందకే వస్తుందని పేర్కొన్నారు. వారి సేవలను విద్యాబోధనకు మాత్రమే పరిమితం చేయాలని, నైట్‌డ్యూటీలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

తప్పుగా అర్థం చేసుకోవద్దు: సీతాలక్ష్మి

నైట్‌డ్యూటీ ఉత్తర్వులపై ఉపాధ్యాయులు, ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో సీతాలక్ష్మి స్పందించారు. సొసైటీ ప్రిన్సిపాల్స్ వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పంపించారు. తమ ఉద్దేశాలను ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకోవద్దని, పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూడాలనే ఉద్దేశంతోనే అలా చేయాల్సి వచ్చిందని వివరించారు. అనుకోని ఘటనలు జరిగితే తొలుత ప్రధానోపాధ్యాయులే బాధ్యులు అవుతారని, అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉపాధ్యాయులు ఒకరికొకరు సాయం చేసుకుంటూ విద్యార్థులకు అండగా ఉంటారని, అందరి శ్రేయస్సు కోసమే ఆ ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు. నైట్‌డ్యూటీకి సంబంధించి ఉపాధ్యాయులకు సీసీఎల్ కూడా అందిస్తామని తెలిపారు. గురుకుల విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సెక్రటరీ జారీచేసిన సర్క్యులర్‌పై కొందరు ఉపాధ్యాయులు పనిగట్టుకుని రాద్ధాంతం చేస్తున్నారని ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ రఫీయొద్దీన్ ఒక ప్రకటనలో ఆగ్రహం చేశారు.

కలిసిరాని దిగుబడి.. మీదపడ్డ పెట్టుబడి!

- **మూడు గుంటల ఆసామి.. నలుగురు ఆడపిల్లలకు తండ్రి**
- **భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం**
- **అప్పులు తీర్చలేక హరిశ్చంద్రర్ ఆత్మహత్య**
- **కష్టాల కడలిలో రైతు కుటుంబం**
- **సర్కారు నుంచి అందని సహాయం**

పరిగి, ఏప్రిల్ 11 : ఐదుగురు అన్నదమ్ముల ఉమ్మడి ఆస్తి 15 గుంటల భూమి. అందులో తన వాటా 3 గుంటలు. ఈ భూమిని తన పేరుపై చేయించుకోవడానికి అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయాడు. తనకు నలుగురు ఆడపిల్లలు. 3 గుంటల భూమితో నలుగురు ఆడపిల్లలను పోషణ కష్టమని, కౌలుకు భూమిని తీసుకుని సాగు చేశాడు. సాగునీళ్లు కరువై పంట దిగుబడి రాలేదు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. అప్పులతో సాగు చేస్తుండగానే, అనుకోని ప్రమాదం మరిన్ని కష్టాలను మోసుకొచ్చింది. కష్టాలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టడంతో ఆ రైతుకు బతుకు భారమనిపించి, చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. కంటికి రెప్పలా కాపాడుకునే తండ్రి కానరానిలోకాలకు వెళ్లడంతో ఆడబిడ్డల రోదనలు ఆకాశన్నంటాయి.

వికారాబాద్ జిల్లా హనుమాన్‌గండి తండాలో హరిశ్చంద్రర్ ఫొటోతో ఇంటి వద్ద భార్యాపిల్లలు

వికారాబాద్ జిల్లా పరిగి మండలం హనుమాన్ గండి తండాకు చెందిన రైతు ముడావత్ హరిశ్చంద్రర్(50)కు నలుగురు ఆడపిల్లలు. ఐదుగురు అన్నదమ్ముల్లో ఒకడైన హరిశ్చంద్రర్‌కు పూర్వీకుల నుంచి వచ్చిన ఉమ్మడి ఆస్తి 15 గుంటల భూమి ఉంది. ఈ భూమిలో హరిశ్చంద్రర్ వాటాగా 3 గుంటలు వస్తుంది. ఈ భూమి తన పేరుపై చేయించుకోవాలనుకున్నాడు. అధికారుల తప్పిదం కారణంగా ప్రస్తుతం వాళ్ల అన్న పేరు మీద ఆ భూమి ఉంది. 3 గుంటల భూమితో నలుగురు ఆడపిల్లల పోషణ కష్టమని గ్రామంలోనే భూమిని కౌలుకు తీసుకున్నాడు. జాగీర్‌కు చెందిన కొంత భూమిని సాగు చేస్తూనే రెండేండ్ల క్రితం 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. పంట దిగుబడి తగ్గిపోవడంతో గత సంవత్సరం కౌలు భూమిని తగ్గించాడు. 5 ఎకరాల భూమినే కౌలుకు తీసుకున్నాడు. ఇందులో మొక్కజొన్న, కంది పంటలు వేసినా దిగుబడి మాత్రం ఆశించినస్థాయిలో రాలేదు. రెండేండ్లు దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి మీదపడింది. అప్పులు పేరుకుపోయాయి. అప్పులతో పీకల్లోతు కష్టాల్లో ఉన్న హరిశ్చంద్రర్‌కు విధి కూడా సహకరించలేదు. రోడ్డు ప్రమాదంలో ఆయన కాలు విరిగింది.తాను సాగుకు దూరమవడంతో ఆ భారం అతని భార్యపై పడింది. ఆయన భార్య ముడావత్ సుశీల కూడా పొలంలో జారిపడింది. ఆమెకు చేయి విరిగింది. దీంతో కుటుంబ బాధ్యతలు ఇంటి ఆడపిల్లలపై పడ్డాయి. ఇదే సమయంలో పెద్ద కూతురుకు సంబంధం కుదరడంతో పెండ్లి చేశారు. మొత్తంగా కుటుంబాన్ని అప్పులన్నీ చుట్టుముట్టాయి. దాదాపు 8 లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. ఓ వైపు అప్పుల బాధ, మరోవైపు కుటుంబ జీవనం మరింత గగనం కావడంతో హరిశ్చంద్రర్ ఫిబ్రవరి1 వతేదీన పంట చేను వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆడపిల్లల చదువులకు కష్టాలు

రైతు హరిశ్చంద్రర్ బలవన్మరణం తరువాత ఆ కుటుంబం రోడ్డున పడింది. పెద్ద కూతురు పెండ్లి అయి అత్తారింటికి వెళ్లిపోయినా మిగిలిన ముగ్గురు ఆడపిల్లల భారం హరిశ్చంద్రర్ భార్య సుశీలపైనే పడింది. సుశీల కూలీనాలీ చేసుకుంటూ ఆడపిల్లలను పోషించుకుంటుంది. హరిశ్చంద్రర్ రెండవ కూతురు మౌనిక పరిగిలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివింది. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన సబ్జెక్టులకు మళ్లీ పరీక్ష రాయలేకపోయింది. పరీక్షలు పూర్తి చేసి, పై చదువులకు వెళ్లాలనుకున్న ఆ అమ్మాయి ఆర్థిక కష్టాలు అడ్డంకిగా మారాయి. మూడవ కూతురు నందిని పరిగి జిల్లా పరిషత్ హైస్కూలు నం.1లో పదవ తరగతి చదువుతున్నది. పది ఫలితాలు వచ్చాక తాను ఇంటర్మీడియట్ చదువాలనుకుంటున్నది. నాలుగో కూతురు మమత హనుమాన్‌గండిలోని ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నది. తండ్రి మరణం కారణంగా ఈ ముగ్గురు ఆడపిల్లల చదువులు